219) సాళంగనాట/మోహన

ప|| ఈతడు తారకబ్రహ్మ మితడు మాదేవుడు | కౌతుకాన జెప్పే వినగదరే వోజనులు ||

చ|| రాముడు యిందీవరశ్యాముడు నానాసార్వ- | భౌముడు షోడశకళాసోముడు |
దోమటిరాక్షసులను తుత్తుమురుసేసినాడు | కామితఫలములిచ్చి కాచినాడు సురల ||

చ|| పూర్ణుడు నీలమేఘవర్ణుడు దానమున వి- | స్తీర్ణుడు వాహనసుపర్ణుడు |
అర్ణవము దాటి రావణాదుల గెలిచినాడు | నిర్ణయించి చెప్పరాదు నే డీతనిమహిమ ||

చ|| వరుడు సీతకు పరాత్పరుడు కోదండదీక్షా- | గురుడు దివ్యామోఘశరు డితడు |
నిరతి శ్రీవేంకటాద్రినెలవై యుండేటివాడు | సరి భరతలక్ష్మణశత్రుఘ్నసహితుడు ||